601069001

అస్థిరం జీవనం లోకే అస్థిరం యవ్వనం ధనమ్.
అస్థిరం దారాపుత్రాది ధర్మకీర్తి ద్వయం స్థిరమ్.

ఏమి తా గాని వచ్చె ఏమి తా గాని పోవు
పుట్టినప్పుడు మరిగిట్టినపుడు
ధనము నెచ్చటి కేగు తానేగు నెచ్చటికి
చెప్పరయ్యమీరు చిత్తమెప్పు నట్లు.

విద్యార్థులారా!

అస్థిరం జీవనం లోకే మనము జీవించునట్టి యీ లోకము స్థిరమైనది కాదు అస్థిరం యవ్వనం ధనం. యవ్వనమనేది మధ్యలో వచ్చి మధ్యలో పోయేది మాత్రమే. దీనికి ప్రారంభము అంత్యము అనునది లేదు. ఇట్టి యవ్వనమునకు మిడిసి పోవటం విద్యావంతుల తత్వము కాదు. ధనమా యిది కూడను స్థిరమైనది కాదు. కేవలము కదలి పోయే మేఘముల వంటిది. ఏనాటికి అది మనలను వుద్ధరము గావించునది కాదు. ఇక దారా పుత్రాదులు వీరు కూడను కేవలము మధ్యలో వచ్చి మధ్యలో విడిపోయేవారే. పెండ్లికి పూర్వము భార్య ఎవరు భర్త ఎవరు తెలియదు. మధ్యలో వచ్చి మధ్యలోనే ఒకరికొకరికి వియోగము సంభవిస్తూ వుంటుంది. బిడ్డ కూడను అంతే. పుట్టక పూర్వము తల్లి ఎవరు బిడ్డ ఎవరు? పుట్టిన తరువాతనే యీ విధమైన సంబంధ బాంధవ్యములు కలిగి వుంటాయి. ఇవన్నియు అస్థిరములే. ధర్మ కీర్తి ద్వయం స్థిరమ్. స్థిరమైనది ఏమిటి? ధర్మము కీర్తి యీ రెండే మానవునికి స్థిరమైన పదార్థములు.

ఈ దృశ్యకల్పితమైన జగత్తంత కూడను చరాచరప్రపంచమంతయు కూడ వస్తువులు కూడను కేవలము కాలవాహినిలో కలసి పోతూ వుంటాయి. యదృశ్యం తన్నశ్యమ్. ఏది మనకు కనుపించుచున్నదో అది కేవలము కొంత కాలములో మనకు కనుమరుగైపోతున్నది. ఈ చర్మ చక్షువులకు గోచరమయ్యే యీ దృశ్య కల్పిత జగత్తంతయు కూడను కాల గర్భములో కలసి పోతున్నాది. చూచే నేత్రము చూడబడే విశ్వము రెండు కూడను అనిత్యములే. ఈ చర్మ చక్షువులు కేవలము మానవులకు మాత్రమే కాదు. పశుపక్షి మృగాదులకు

క్రిమి కీటకాదులకు యీ నేత్రము లుంటున్నాయి. దీని యొక్క విశేషము ఏమిటి? మానవునకు చర్మ చక్షువులున్నవి. క్రిమి కీటకాదులకు చర్మ చక్షువులున్నవి. పశుపక్షి మృగాదులకు చర్మ చక్షువులున్నవి. కానీ మానవుని యొక్క విశిష్టత ఏమిటి? నిజముగా జ్ఞాన చక్షువులనే తాను అభివృద్ధి పరచుకొనకుండిన యీ చర్మ చక్షువులుండి కేవలము పశుపక్షి మృగాదులతో సమానము అనిపిస్తుంది. మానవ జీవితము అమూల్యమైనది. అర్థవంతమైనది. అనుభవించ తగినది. ఇట్టి పవిత్రమైన మానవ జీవితమును సార్థకము గావించుకొనవలెనన్న ఆత్మ జ్ఞానము అత్యవసరము. అందువలననే జంతూనాం నరజన్మ దుర్లభమే. ఇది దుర్లభమే. జ్ఞానమే లేకుండిన పశువుతో సమానమే. ఈ చర్మ చక్షువులు కేవలము బాహ్యమైన స్థూలమైన జగత్తును చూడగలుగుచున్నవే గాని సూక్ష్మమైన దివ్యత్వమును యిది గుర్తించుటకు సాధ్యము కాదు. ఎవరి నేత్రములు వారే చూడలేరు. మీ నేత్రములు మీరు చూడగలుగుచున్నారా? లేదు. ఏదో ఒక ఆధారము పురస్కరించుకొని యే నేత్రములు మీరు చూడగలుగుచున్నారు. ఆధారమే లేకుండిన తన నేత్రములు తాను చూడలేకపోతున్నాడు మానవుడు. ఈ స్థూలమైన నేత్రము యీ స్థూల దేహమునే గుర్తించలేకపోయినప్పుడు సూక్ష్మమైన మనస్సును యేరీతిగా గుర్తించగలదు. ఈ సూక్ష్మమైన మనసునే గుర్తించలేని నేత్రములు అత్యంత సూక్ష్మమైన ఆత్మ తత్త్వమును యేరీతిగా గుర్తించగలదు. కనుక చర్మ చక్షువులు కేవలము సహజమైన జీవితానికి దృశ్య కల్పితమైన జగత్తును చూపించుటకు మాత్రమే. జ్ఞాన నేత్రము ప్రతి మానవునకు అవసరము. జ్ఞాన నేత్రమన్నా దివ్య నేత్రమన్నా ఆత్మనేత్రమన్నా బ్రహ్మనేత్రమన్నా యివన్నీ ఒకదానికొకటి పర్యాయ పదములు మాత్రమే. కనుక సర్వం బ్రహ్మ అనే భావము మనము విశ్వసించినప్పుడే జగత్తంతయు బ్రహ్మ భావముతో రూపొందుతుంది. ఎట్టి భావమో అట్టి దృశ్యము ఎట్టి రంగో అట్టి ప్రకృతి. దృష్టిని జ్ఞానమయముగా మార్చుకున్నప్పుడే సృష్టి బ్రహ్మమయముగా రూపొందుతుంది. మన చర్మ చక్షువులకు యేవిధమైన అద్దములు ధరింతుమో ప్రకృతి అంతయు ఆ రంగులో కనుపిస్తుంది.

కనుపించేవన్నీ మార్పు చెందునవే. కనుక మార్పు చెందు యీ దృశ్యమునకు మార్పు చెందని స్థిరత్వమనే బ్రహ్మత్వము ఆధారమై వుంటుంది. మనము కారులో ప్రయాణమవుతున్నాము. లేక బస్సులో ప్రయాణమై పోతున్నాము. బస్సు కదులుచూవుంది. రోడ్డు కదలటం లేదు కదా. కదలని రోడ్డును ఆధారము చేసుకొని కదిలే బస్సులు కార్లు ప్రయాణము సల్పుతున్నాయి. కనుక కదలే యీ జగత్తుకు, మార్పుచెందే యీ జగత్తుకు

కదలని, మార్పుచెందని ఒక దివ్యత్వము ఆధారమై వుంటున్నాది. అట్టి ఆత్మ తత్వమును మనము మొట్టమొదట గుర్తించుకుంటేనే యీ జగత్తు యొక్క రహస్య మంతయు సులభముగా అర్థమవుతుంది. ఈ జగద్భావము అర్థము కాకుండా పోవటానికి మూలకారణము మన మనస్సే. మనస్సు ప్రవృత్తి యొక్క లక్షణము, ఈ దృశ్యమైన వస్తు వాహనములందు రాత్రింబవలు మన జీవనము వ్యర్థము గావిస్తున్నాము. దీని నిమిత్తమై మనము జన్మ ధరించినామా. కాదు కాదు. బ్రహ్మ సత్యాన్ని గుర్తించాలి. దీనిని గుర్తించాలనుకున్నప్పుడు బ్రహ్మతత్వాన్ని మనము చింతించాలి. దీనిని తెలుసుకొనుటకు ప్రయత్నించాలి. దీనిని చూడటానికి ప్రయత్నించాలి. దీనితో సంభాషించటానికి ప్రయత్నించాలి. అదే నిజమైన Religion. Man must realise God, seek God, see God, talk to God. This is Religion. కనుక మానవుడు మొట్టమొదట గుర్తించవలసినది దైవత్వమును. Man must realise God. దీనిని తెలుసుకొనకుండా యెన్నింటిని తెలుసుకున్నప్పటికిని ప్రయోజనము లేదు.

అనిల్ కుమార్ కొన్ని నిముషములకు పూర్వము వృక్షశాస్త్రమును గూర్చి చెప్పాడు. మనము ఆశించేది ఫలపుష్పాలు. ఫలపుష్పములు వృక్షముపై వుండునవి. కనుపించే ఫలపుష్పములు, ఆశించే ఫలపుష్పములు దేనిపైన ఆధారపడి వుంటున్నవి. మనము వేర్లను పోషించినప్పుడే కనుపించే ఫలపుష్పములు మనకు ప్రాప్తిస్తాయి. కనుక మనము నీరు ఎరువులు పోసి పోషించవలసినది వేర్లను మాత్రమేగాని ఫలపుష్పములను కాదు. కనుక యీ జగత్తనే వృక్షమునకు దివ్యత్వమైన ఆత్మ తత్వమే దీని వేర్లు. దీనినే భగవద్గీత యందు బీజమ్ మాం సర్వ భూతానాం అన్నది. ఎట్లా యీ బీజము తానైనాడు. తానే బీజమైనవాడు సర్వుల యందు యీ బీజరూపములో యేవిధముగా వున్నాడు అనే విషయాన్ని మనము విచారించటానికి పోయినప్పుడు ఒక విత్తనము నాటాము. అది క్రమక్రమేణా మొక్కై వృక్షమైంది. ఈ వృక్షములో శాఖోపశాఖలు బయలుదేరాయి. ప్రతిశాఖయందు పుష్పములు వికసించాయి. ఆ పుష్పములన్నియు కాయలుగా రూపొందాయి. కాయలన్ని ఫలములుగా మారాయి. ఒక్కొక్క ఫలమునందు ఒక్కొక్క బీజము చేరిపోయింది. మనము నాటినది ఒక బీజమే. కొన్ని వందల ఫలములలో వందల బీజములు బయలుదేరాయి. అనగా ఏ విత్తనము నాటినా ఆ విత్తనము జాతియే మరి యితర ఫలములలో విత్తనముగా రూపొంది పోయింది. ఇది జగత్తు. ఈ జగత్తుకు ఆత్మనే ఒక బీజము. ఈ విశ్వమే ఒక పెద్ద వృక్షము. విశ్వమనే వృక్షమునకు ఒక్కొక్క దేశము ఒక్కొక్క కొమ్మ. ఒక్కొక్క కొమ్మ లోపల అనేక జీవరాసులు

బయలు దేరాయి ఫలములుగా. ఈ ఒక్కొక్క జీవరాశి యందు కూడను యీ ఆత్మ అనే బీజము తిరిగి అందులో విస్తృతముగా పోయి చేరింది. కనుక ఒకొక్క వ్యక్తియందు కూడను ఆత్మ స్వరూపుడై తాను వుంటున్నాడు. ఏకోవసి సర్వభూతాంతరాత్మ. అందరియందు వుండినటువంటిది నాటిన బీజమే. కానీ యీనాటి విద్యార్థులు యీ యొక్క రహస్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించటము లేదు. దీనిని తెలుసుకోవాలనే అపేక్ష కూడను చాలా తక్కువ. వీళ్ళకొన్ని subjects physics కావాలి Chemistry కావాలి Mathematics కావాలి యేరకమైన దాంట్లో ఒక subject పైన మాత్రమే తాము జీవితమును అంకితము గావించి ఆ subject ద్వారా జీవనోపాధి నిమిత్తమై తగిన ప్రయత్నములు సలుపుచున్నారే గానీ జీవితపరమావధి తత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు.

మాథమెటిక్సును మరువక పఠియించు
గణిత శాస్త్రము వంక కనగ బోడు
అమెరికా మార్గంబు నరయ జూతురుగాని
కాశికా మార్గంబు కనరాడు.
ఆల్జీబ్రాయంతయు అరయ జూచునుగాని
ఇంటి వైశాల్యంబు నెరుగలేడు.
అనుదినంబును డ్రిల్లు ఆచరించునుగాని
పద్మాసనము వేయ బాధపడును.

ఏమిటి యీ విధమైన exercise చేసిన ఫలితమేమిటి? యిన్ని విధములుగా చేస్తున్నారు శరీర వ్యాయామము. కూర్చోటానికి చేతకాదు. ఇలాంటి విద్యార్థుల యొక్క తత్వము కేవలము బాహ్య దృశ్యము పైననే ఆధారపడి ఆకర్షింపబడుతున్నాది.

'త్యాగేనైకే అమృతత్వ మానసు' యిదే ప్రధానమైన మంత్రము. నీవు ఎన్ని సత్కర్మలు ఆచరించినప్పటికిని ఎన్ని విధములైన సిరిసంపదలతో తులతూగుతున్నప్పటికిని యివన్నీ కూడను కేవలము అస్థిరములు, అశాశ్వతములు. ఇవన్నీ నీకు అమృతత్వము నందించవు. దేనిని మనము త్యాగము చేయాలి. ఆస్తిపాస్తులు త్యాగము చేయటమా ఆలుబిడ్డలు త్యాగము చేయటమా? కాదు. కాదు. నీకు బంధన ఏమిటి? ఆబంధన తెలిసీ నీవు గుర్తించినప్పుడే ఆబంధన విసర్జించటానికి తగిన కృషి చేస్తావు. ధన కనక వస్తు వాహనాదులుగాని, ఆలుబిడ్డలుగాని, యిల్లు భూములుగాని బంధనలు కావు. నీవు

దేహమని భావించటమే పెద్ద బంధన. దేహ భ్రాంతియే పెద్ద బంధన. నేనే దేహమనే భావము విసర్జించాలి. అప్పుడే మోక్షమనేది లభిస్తుంది. కనుక బంధవిమోచన అనగా యేమిటి? దేహ భ్రాంతిని వదలిపెట్టి ఆత్మ భ్రాంతిలో వుండటమే. దేహ విరక్తి దైవ ఆసక్తి యీ రెండింటి యొక్క సన్నిహిత సంబంధమే బంధవిమోచన మోక్షప్రాప్తి రెండు కూడను సంభవిస్తాయి. ఐతే దేహభ్రాంతిని వదలటము యెట్లా? దేహభ్రాంతి అంటే అన్నపానాదులు విసర్జించి, దీనిని అభివృద్ధి పరచుకొనే మార్గములు విసర్జించి కేవలము శుష్కించి అస్థిపంజరముగా మారి మరణించటము కాదు. దేహ సంబంధమైన ఆహార విహారములు సక్రమముగా సలుపుకో. తప్పు లేదు. కాని దేహమే నేను అనే భావము విసర్జించు. నేను దేహము కాదు. అది ఉపాధి. దేహేంద్రియ మనో బుద్ధులన్నియు నా ఉపాధులు. నేను ధరించిన దుస్తులు. ఈ దుస్తులు యేవిధముగా మనము మార్చుకుంటున్నామో, యేవిధముగా విసర్జిస్తున్నామో అదే విధముగనే యీ దేహభ్రాంతిని మనము విసర్జించాలి. ఈ దేహమును పోషించవలసిన సక్రమమైన మార్గము అనుసరించు. భిక్షాన్నం దేహరక్షార్థం వస్త్రం శీతనివారణం. దేహమునకు సంబంధించిన శీతనివారణకై ధరించవలసిన వస్త్రములు ధరించాలి. ఈ ఆకలి దప్పులకు సంబంధించిన నియమములను సరిగా పాటించాలి. మొన్న ఒకడు లోపల నాకు ఆకలవుతున్నది నేను భుజిస్తాను యిది స్వాతంత్ర్యము అన్నారు. నాకు దప్పి అవుతుంది నేను నీరు త్రాగుతానన్నాడు యిది స్వాతంత్ర్యము అన్నాడు. ఇది స్వాతంత్ర్యము కాదు. కేవలము ఒక విధమైన నిర్బంధము చేత భుజిస్తున్నావు, పానీయము త్రాగుతున్నావు. ఆకలి వుండటం చేతనే నీవు ఆహారము భుజిస్తున్నావు. నీ ఆకలి నివారణ నిమిత్తము అన్నమును భుజిస్తున్నావే గాని యిది స్వాతంత్ర్యము ఎట్లా అవుతుంది. నీకు దప్పిక వున్నది కనుకనే దప్పిక నివారించుకోటానికి జలము తీసుకుంటున్నావు. ఇవి కొంచెము వరకు జగత్సంబంధమైన నియమములు. Law of nature. కనుక యివన్నీ స్వాతంత్ర్యమునకు సంబంధించినవి కాదు. స్వాతంత్ర్యమునకు సంబంధించినది ఆత్మానందమే.

ఈ ఆనందము మనకు యేవిధముగా లభిస్తుంది. దేహము చేత లభిస్తుందా? కాదు. మనసు చేత లభిస్తుందా? కాదు. ఇది దేహమనస్సుల చేత లభించే ఆనందము కేవలము తాత్కాలికమైన ఆనందము. ఇలాంటి ఆనందము నిమిత్తమై మానవుడు సృష్టింపబడలేదు. శాశ్వతానందమును అనుభవించే నిమిత్తమై మానవుడు తానే తనరూపమును

తరించుకున్నాడు. ఇదంతయు కేవలము దైవసంకల్పమే. నీకు నీవు ఏ కార్యము ప్రయత్నముతో సాధింపలేవు. మొన్న చెప్పాను. మానవుని ప్రయత్నము చేత సాధింపబడని కార్యములు ఎన్ని లేవు. ఏ ప్రయత్నమూ చేయక పోయినప్పటికిని ఫలించే కార్యములు ఎన్ని లేవు. కేవలము యిది నేను సాధించాను అనేది కర్తృత్వ భోక్తృత్వానికి మూలకారణము యిదే అహంకారము. ఆనందము నీ స్వరూపమే. నీవే ఆనంద స్వరూపుడు. ఐతే నీ ఆనందమును నీవు గుర్తించ లేక పోతున్నావు. రాగద్వేషముల చేత అహంకార మమకారముల చేత అభిమాన అజ్ఞానము చేత కప్పబడి వుంటున్నాది యీ ఆనందము. రాగద్వేషములు దట్టమైన బట్టలు. ఇవియే మన ఆనందమును అడ్డు పరుస్తున్నాయి. ఈ రాగద్వేషములు మనము దూరము గావించుకున్నప్పుడు మన స్వస్వరూపాన్ని మనము ధరించగలము. కనుక ఆనందము మనమే. తానే ఆనందమై తిరిగి ఆనందమును మనము తెలుసుకొనుటకై ప్రయత్నిస్తున్నాము. ఇది ఎంత వెఱ్ఱితనము. తనయందే సర్వము వుండినప్పటికిని బాహ్యమైన విషయ వాంఛల చేత దృశ్యకల్పితమైన జగత్తునందు పోయి మనము అనేక రకములైన వాంఛలను అనుభవించటానికి ప్రయత్నిస్తున్నాము

కోరిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ
పెరటి పుష్పములకై ప్రీతియేల
అడిగిన పాలిచ్చు కామధేనువె రాగ
ధనమిచ్చి ఆవును కొనగనేల
మండెడు కాంతితో మేరుపర్వతముండ
వెండి బంగారుకై వెతకనేల

సర్వము తానై వుండగా యీ అల్పమైన స్వల్పమైన విషయాలకు మనము ఎందుకు ఆరాటపడుతున్నాము. తానంత అధికుడు, తానంత గొప్పవాడు, తానే ఆనంద స్వరూపుడని తెలియక పోవటం చేతనే.

విద్యార్థులారా! మీకు తెలిసిన విషయమే. ఏనుగు బలము ఎంతటిదో అనుభవించిన వానికే అర్థమవుతుంది గాని అన్యులకు అర్థము కాదు. కేవలము ఒక తొండముతో కొట్టిందంటే తొమ్మిది అడుగులు ముందుకు పోయి పడతాడు. అంత బలమైంది ఏనుగు. కానీ బలహీనుడైన మావటి తన అంకుశము చేతిలో పట్టుకున్నప్పుడు వాడు చెప్పినట్లు వింటుంది ఏనుగు. వాని బలమెంత ఏనుగు బలమెంత? తన యొక్క శక్తి

ఆ ఏనుగుకు తెలీదు. శక్తి వున్నది. కానీ తెలియక పోవటం చేతనే అల్పునికి స్వల్పమైన వానికి అది అణగి మణగి వుంటున్నాది. మీకు బాగా తెలుసు. తుమ్మెద. ఆ తుమ్మెద చేవ బారిన కఠినమైన కట్టెనైనా తొల్చుకొని లోపలకు ప్రవేశిస్తుంది. యింత కఠినమైన కట్టెను కూడను తొల్చుకు పోయే శక్తి వున్న తుమ్మెద అతి సున్నితమైన కమలములో ప్రవేశించినప్పుడు కమల రేకులు అన్ని చేరి పోయినప్పుడు బంధింపబడి తనశక్తిని తాను మరచి అందులోనే తాను మరణిస్తుంది. తన శక్తి తనకు తెలియదు. అదే విధముగనే మానవుడు తనలో వుండిన ఆనందమును, తనలో వున్న దివ్యత్వమును, తనలో వున్న పవిత్రతను తాను గుర్తించుకోటానికి తగిన ప్రయత్నము చేయటంలేదు. చేయకపోయినప్పటికిని చెప్పిన వారి మాటలను విశ్వసించటంలేదు. దానికి తగిన కృషి చేసినప్పుడు తప్పక యీ సత్యాన్ని మీరు అనుభవిస్తారు. ఈ సత్యము చేత మీరు తప్పక ఆనందమును అనుభవిస్తారు.

కస్తూరి మృగము. అది ఒకరకమైన deer. అది అప్పుడప్పుడు తననుండి సుగంధము ఆవిర్భవిస్తూ వుంటుంది. అది తనయొక్క నాభినుండి పుడుతుంది. ఆ సుగంధమును తాను అనుభవిస్తుంది. ఎక్కడనుంచి వస్తున్నాది యీ సుగంధమని అరణ్యమంతా తిరుగుతుంది. అడవంతా తిరిగి అలసిపోయి కట్టకడపటికి ఒక వృక్షచ్ఛాయలో కూర్చుని కొంచెము విశ్రాంతి తీసుకుంటుంది. ఆ విశ్రాంతి తీసుకునే సమయము లోపల తన ముక్కు తన నాభి దగ్గర వుంచుకొని విశ్రాంతి కోసము పవ్వళిస్తుంది. అప్పుడు తన నాభినుండి వచ్చిన సుగంధము తాను గుర్తించుకుంటుంది. అయ్యో నేను ఎంత పిచ్చిదానను. నానుండియే వచ్చిన యీ సుగంధమును నేను తెలుసుకొనలేక యీ సుగంధము ఎక్కడవుందని అడవి అంతా తిరిగాను. అలసి పోయాను. ఇదే అజ్ఞానము యొక్క తత్త్వము. మానవుడు కూడను అంతే. నిత్యానందము, బ్రహ్మానందము, అద్వైతానందము అనేవి మానవుని స్వరూపము స్వభావము. ఈ బాహ్యసంబంధమైన, భౌతిక సంబంధమైన యీ ప్రాకృత సంబంధమైన విషయ వాసనకు లోబడి పోవటం చేతనే దివ్యమైన భవ్యమైన నవ్యమైన యీ దివ్య తత్త్వమును తాను అర్థము చేసుకొనలేక పోతున్నాడు. అనుభవించలేక పోతున్నాడు. అన్వేషించలేక పోతున్నాడు.

అన్నింటికిని దేహాభిమానమే మూలకారణము.

దేహము పాంచ భౌతికము దేహము కూలక తప్ప దెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టు కల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడ నా
దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ నాత్మరూపుడౌ.

కనుక నిజముగా తన యొక్క ఆత్మనే సర్వవిధములైన మార్గములు మానవుల కందిస్తూ ఆనం
దింప జేస్తున్నది. ఆత్మ నిరంతరము ఆనందము నందించునే గాని దుఃఖ విచారముల
కేవి తనలో యేమాత్రము లేవు. పాత్రలో పోసిన పాయసము, యీ పాత్రకు యెన్ని రంధ్రము
లు కొట్టినా యే రంధ్రము నుండి వచ్చినా పాయసమే వస్తుంది గాని మరొక చేదు రాదు. ఆత్మ
ఆనందమయము. కనుకనే ఋషులందరు యీ ఆత్మకు ఆనందమని పేరు పెట్టారు.
ఆ ఆనంద మంటే ఎలాంటి ఆనందము.

బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం
భావాతీతం త్రిగుణా రహితం

ఇవి ఆత్మస్వరూపము యొక్క, ఆత్మ స్వభావము యొక్క సరైన గుర్తులు. ఇట్టి ఆనందము
యేనాడు దుఃఖములుగాని కష్టములుగాని, బాధలుగాని, విచారములుగాని అందించదు. అట్టి
సన్నిధిని సన్నిధినే వుండగా దుఃఖములు, విచారములు, కష్టములు కలిగించే యీ జగత్తునకై
మీరెందుకింత ఆరాటపడుతున్నారు.

విద్యార్థులారా! ధననిధికి లోకములో కొన్ని విధములైన కట్టుబాట్లు చేస్తూ వుం
టారు. ఇప్పుడు కొన్ని బ్యాంకులు వున్నాయి. బ్యాంకులో కావలసిన ధనము వుంటుంది. కానీ
ఆ ధనమును అట్లే విసర్జించి పోవటం లేదు. దానికి కావలసినంత బందోబస్తు చేస్తున్నా
రు. ఇనుపపెట్టెలలో బంధిస్తున్నారు. పెద్ద పెద్ద locks అంతా తగిలిస్తున్నారు. రాత్రింబవ
లు పహరా వారు దానిని రక్షిస్తున్నారు. అందులో వున్న ధనాన్ని మనము పొందాలనుకుంటే యీ
ద్వారమును తెరగాల్సి. తాళమును పగలగొట్టాలి. అందులో watchman ను కొట్టి వారిని
అన్నివిధముల స్వాధీనము చేసుకోవాలి. అప్పుడే ఆ ధనము మనకు చిక్కుతుంది. అదే విధ
ముగనే యీ ఆనందమనే నిధికి ఒక విధమైన భద్రత యేర్పడింది. దానిని కాపాడేది యేమిటి
అహంకారమనే సర్పము సర్వత్రా సంచరిస్తూ వుంటుంది. నిర్విరామముగా తిరుగుతూ వుంటుం

ది. కనుక దాని దగ్గరకు ఎవ్వరూ పోలేక పోతున్నారు. ఎవడు అహంకారమనే సర్పమును నిర్మూలము గావింతురో వారికే యీ ఆనందము లభ్యమవుతుంది. కనుక యీ అహంకారము కేవలము అజ్ఞానము చేత ఆవరించింది. ఈ అహంకారమునకు కారణం ఏమిటి? ధనమా కారణము లేక బలమా కారణము లేక దానమా కారణము, అధికారమా కారణమా? ఇవి యేవీ కారణం కాదు. ఇవన్నీ అల్పమైన శక్తులు. ఇవన్నీ అహంకారమునకు కారణం ఎట్లా అవుతాయి. దేహభ్రాంతియే దీనికి మూలకారణము. ఇవన్నీ ఎంతకాలము అందుకోసమే శంకరాచార్యుల వారు 'మాకురు ధనజన యౌవ్వన గర్వం హరతి నిమేషా కాల సర్వమ్! ఈ ధనము, బలము, సంపదగురించి తాను అహంకార పడుతున్నాడు. ఇవి ఎంత సేపు క్షణములో మార్పు చెందుతుంది. ఇవన్నీ అనుభవించిన వ్యక్తులు ఎక్కడున్నారు స్థిరముగా? గొప్పగొప్ప పదవులనంతా ఏలి సిరిసంపదలనను భవించి ప్రఖ్యాతిని పొంది రారాజులుగా మారి చక్రవర్తులుగా మారిన వ్యక్తులంతా ఎక్కడ. వారున్నారా. వారి స్థానములున్నాయా? వారి యొక్క ధనమున్నదా? ఏదీ లేదు. ప్రాచీన కాలమునుండి భారత దేశమునందు అనేక మంది అనేక రకములైన సాధనలు సల్పి ఇవన్నీ అనిత్యము అని లోకమునకు చాటి చెప్పుతూ వచ్చారు.

నిరతసత్యవ్రతాఢ్యి ధరణి నేలిన
హరిశ్చంద్రు డీ ధర బాసి చనగలేడె
ఎల్లలోకము లేలె ఎసగ శ్రీనలరాజు
తనవెంట భూమిని కొనుచు చనెనె
కృతయుగంబును నలంకృతి చేయు మాంధాత
సిరి మూటకట్టుక యరిగినాడె.
జలధి సేతువు కట్టె అలనాడు శ్రీరాము
డుర్విపైనిపుడు తానున్నవాడె
ఎందరెందరో రాజులు యేగినారో
ఒక్కరును వెంటగానిపోరుర్విలవము
పేరు మాత్రము మదు సిరియు విద్యయు
తలను గట్టుక పోరు విద్యార్థులార.

ఏదీ మనవెంటరాదు. వచ్చేవి రెండే. మంచి. చెడ్డ. మనము ఏది చేస్తామో అది మన వెంట వస్తుంది. మంచిని చేసి మంచిని తీసుకోండి. ఏ విత్తనములు నాటుతామో ఆ ఫలములే వస్తాయి.

విద్యార్థులారా! లౌకికముగా మీరు అలక్ష్యము చేస్తున్నారు. భవిష్యత్తులో ఏ నాటికైనా కూడను యివి అనుసరించుకాని మొక్కలు రాక తప్పదు. నీవు ముండ్ల బీజములు వేయి, పండ్ల బీజములు వేయి మొక్కలుగా వస్తాయి. అట్టి విశ్వాసమే భారతీయుల విశ్వాసము. కర్మఫల విశ్వాసమును విశ్వసించినవారు భారతీయులు. కనుక నీ హృదయములో మంచిని ఆవిర్భవింప చేసుకొని నేను ఆత్మస్వరూపుడను, నా భావము బ్రహ్మ స్వభావము నేను యీ పని చేయతగినదా చేయతగనిదా, నేను ఆత్మగా వుండి యీ అనాత్మ సంబంధమైన తుచ్ఛ కార్యములలో ప్రవేశించటము మంచిది కాదు. అని ప్రతి కార్యము నందు కూడను తన దివ్యత్వమును స్మరించి ఆ కార్యములో ప్రవేశించాలి. అప్పుడే దోషములకు దూరమౌతాడు. మోసమునకు దూరమౌతాడు. ఆత్మ ఆశలో ప్రవేశిస్తాడు. ఇలాంటి విచారణ విద్యార్థులకు అత్యవసరము.

మనము చదువుతున్నాము. గొప్పగొప్ప డిగ్రీలు తీసుకుంటున్నాము. ఇంకా విదేశములకు వెళ్ళి యింకా అధికమైన డిగ్రీలు పొందుతున్నాము. ఈ చదువులు చదివి మనము దేనిని సంపాయిస్తున్నాము. ఈ చదువులు చదివి ఉద్యోగములో చేరి లంచములు పుచ్చుకోటం కోసమా మోసాలు చేయటం కోసమా, అబద్ధాలు ఆడటం కోసమా, పొట్టను పోషించుకునే కోసమా కాదు. కాదు. ఈ చదువులు యిలాంటి అపవిత్రమైన మార్గములలో ప్రవేశపెట్టటం. పరులను మోసగించి పొట్టను పోషించుకోవాలనుకుంటే యీ విద్య ఎందుకు. కనుక మన విద్య ఆత్మ విద్య. దీని ద్వారా మనము పవిత్రమైన ఆదర్శవంతమైన జీవిని మనము లోకమునకందించాలి. జానెడు పొట్ట నింపుకోటం కోసమని రెండు చేతులనిచ్చాడు. రెండు చేతుల నిండుకు పని చేస్తే కష్టపడి పని చేస్తే పొట్ట నిండదా! మనము రెండు చేతులతో శ్రమించి పని చేయటం లేదు. కనుక మనము యీ అవస్థలకు గురై పోతున్నాము. కర్మనే మనకు లక్ష్యము. పవిత్ర కర్మలు ఆచరించాలి. ఆదర్శవంతమైన కర్మలాచరించాలి. అన్యులకు సహాయకరమైన కర్మలు ఆచరించాలి. దేశోద్ధారమునకై తగిన జీవితమును అంకితము చేయాలి. మన యొక్క దేశము మన మాతృదేశము. మాతృభావము లేకపోతే మనమింక యే విధముగా జగత్తులో వుండగలము.

60106901l

ఒకానొక సమయములోపల సుభాష్ చంద్ర బోస్ కలకత్తా యూనివర్శిటీ లో చదువుతున్నాడు. అందులో ఒక బ్రిటీషు లెక్చరరు భారతదేశమును, భారతదేశ ప్రజలను గురించి కొంచెము అలక్ష్యముగా హేళనగా మాట్లాడుతూ వున్నాడు. కాని యీ విధమైన తన మాతృదేశ దూషణ తాను వినలేక పోయాడు

ఇది నాప్రియ మాతృదేశము

ఇది నాప్రియ మాతృభాష యిది నామతం

ఇదె నావ్రతము.

దేశాభిమానము లేకుండా దీనిని మనము విచారణ చేయకుండా మనము జీవించుచున్నామంటే యిది నిజంగా మాతృదేశముగా భావిస్తున్నామా? మాతృదేశమునకు యేమైనా చెయ్యాలని సంకల్పించుకున్నారు. కానీ విచక్షణా జ్ఞానము కలిగినవాడు కనుక కొంతసేపు ఓపిక పట్టుకున్నాడు. కానీ వినలేక పోయాడు ఆ మాటలు. ఒక దూరి మూడు దస్కులు ఎగిరి ఆ బ్రిటీషువాని తలపట్టుకొని తన చెప్పు తీసుకొని కొట్టాడు. దేనినైనా సహిస్తాను. నామాతృదేశమును దూషించటము నేను సహించలేను. నేను నరకమునకు పోయినా పరవాలేదు నా దేశము యొక్క గౌరవమును నేను కాపాడుకోవాలి. అటువంటి వాడు సుభాష్ చంద్రబోస్. ఈ దృశ్యాన్ని చూచిన విద్యార్థులందరు కూడను యేమి చేయలేక పోయారు. పులిపిల్ల వలె ఎగిరి అతనిని అనేక విధములుగా హింసిస్తున్నాడు. అతను help me, help me అని అంటున్నాడు. ఎవరి help లేదు. ఈ వార్త క్షణములలోపల university అంతా పాకిపోయింది. ఎమర్జెన్సీ మీటింగు పెట్టుకున్నారు. ఇతనిని యింక ఐదు సంవత్సరములు కలకత్తా యునివర్శిటీలో చదవటానికి వీలులేదని నిర్ణయము చేశారు. దానిలో అతను చదువునైనా త్యాగము చేశాడు. నిజమైనది నా మాతృభూమి నారక్తము భారతదేశములో పుట్టినది, భారతదేశములో పెరిగినది భారత దేశమునకే అంకితము కావాలి. ఈ కృతజ్ఞతను తాను పాటిస్తూ వచ్చాడు. తండ్రి యీ విషయమును గుర్తించి లోను లండనుకు పంపించాడు. ఇండియాలో చదువటానికి అవకాశము లేదు. అక్కడకు పోయి కూడను దేశాభిమానము హృదయములో పెట్టుకున్నాడు. నాపవిత్రమైన భారత దేశము త్యాగభూమి యోగభూమి. కర్మభూమి. భోగభూమి కాదు. నేను చదవటానికి వచ్చానుగాని నేను యీ దేశములో స్థిరమై పోవటానికి రాలేదు. శ్రద్ధాభక్తులతో చదివి ICS ప్యాసు చేశాడు. మంచి ఉన్నత స్థాయిలో. తిరిగి అక్కడ నుండి వచ్చి రాజకీయములలో ప్రవేశించాడు. నేను ఆహారములో యీ దేహమును పోషించు

కున్నాను. ఈ దేశము జలము చేతనే నేను దేహమును కాపాడుకున్నాను. నా దేశమునకు నేను
కృతజ్ఞత చూపాలి. అదే విధముగా మన సంస్థగాని మనము ఎవరినుండి ఇంత స్థాయికి
వచ్చామో ఆ కృతజ్ఞతను విద్యార్థులు మరువరాదు. అది నిజమైన దీక్ష నిజమైన త్యాగము.
స్వార్థమును త్యాగము చేసి పరార్థమును విశ్వసించి పరమాత్మను పొందాలి.

విద్యార్థులారా! భగవద్గీతగాని బైబులుగాని ఖురానుగాని గ్రంథరాజముగాని
ఇంక ఏ విధమైన ఇంక ఏ విధమైన పవిత్ర గ్రంథములైనప్పటికి పారాయణ నిమిత్తమై
ఆవిర్భవించలేదు. ఆచరించే నిమిత్తమై అందించారు. మనము ఆచరణలో పెట్టాలి.
ఎన్ని శ్లోకములు చదివి ఏమి ప్రయోజనము. ఎన్ని విధములైన వ్యాఖ్యానములు చేసి
ప్రయోజనము ఏమిటి? లేదు.

గంగి గోవుపాలు గరిటెడైనచాలు
కడవెడైన నేమి ఖరము పాలు

cow milk ఒక tea spoon ఉండినా చాలు. చదువుతూ ఉంటాము భగవద్గీత పారాయణ.
ఏడు నూరు శ్లోకములు కంఠస్థము చేస్తున్నారు. కంఠ భారము తప్ప మన బాధలు ఏ విధము
గా నివారింప లేదు. ఎంతమంది భగవద్గీత వ్యాఖ్యానము చేస్తున్నారు. ఇది భక్తి అనుకుంటా
రా ఇది ఆడంబరము. ఈనాడు ఆకార మానవుని కంటె ఆచార మానవుడు అత్యవసరము. ఆచా
రమానవుని వలనే లోకమునకు ఉపయోగము ఉంటున్నది. ఆచారము లేని విచారము
ప్రయోజనము లేదు. కేవలము ఒక సంస్థలో పేరు పొందవచ్చు. ఇంకా పెద్ద పెద్దవాళ్లైతే
పద్మవిభూషణ బిరుదులు పొందవచ్చు. కాని శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః అనే
బిరుదును అందుకోలేరు. దీనికి మించిన మరొక టైటిల్ లేదు. నీవు అమృత పు
త్రుడవు అని వేదము చాటుతున్నది. కనుక విద్యార్థులారా! ధనపదవుల కోసమనిగాని
పేరు ప్రతిష్ఠల కోసమనిగాని మీరు ప్రాకులాడకండి. దేశాభిమానము, దైవాభిమానము
ధర్మాభిమానము పెంచుకోండి. ధర్మమునకు మించినది లేదు. సత్యాన్నాస్తి పరో ధర్మః.
సత్యమునకు మించిన ధర్మముగాని ధర్మమునకు మించిన సత్యముగాని మరొకటి లేదు.
సత్యధర్మములు రెండు అన్యోన్య ఆశ్రయములు అవినాభావ సంబంధములు. కనుక ఏ కించి
త్తైనా మనము ఆచరించి ఇతరులకు అందించటానికి తగిన కృషి చెయ్యాలి. అప్పుడే ఆనంద
తత్త్వమేది మనకు అర్థమవుతుంది. నిజముగా మీరు ఆనంద స్వరూపులు ఈ ఆనంద నిమి
త్తమై మీరు ఈ కర్మలన్నీ ఆచరిస్తున్నారు. చదివేది ఆనందము కోసమని, పెండ్లి చేసు

G01069013

కునేది ఆనందము కోసమని, బిడ్డలు కావాలనేది ఆనందము కోసమని, ఉద్యోగము కావాలనేది ఆనందము కోసమని, ధనము సంపాదించాలనేది ఆనందము కోసమని లక్ష్యము ఒక్కటే. మార్గములు వేరు వేరు అయినప్పటికిని గమ్యము ఒక్కటే. కనుకనే

శృంగారములు వేరు బంగారమొక్కటె
పశుల వన్నెలు వేరు పాలు ఒకటె
జీవ జంతులు వేరు జీవుండు ఒక్కడే
జాతి నీతులు వేరు జన్మమొకటె
దర్శనంబులు వేరు దైవమొకటె
పూల జాతులు వేరు పూజ ఒకటె
తెలియలేకను మానవుల్ తెలివి తప్పి
బ్రతుకు కోసము బహుబాధ బడ్డలైరి.

ఈ బ్రతుకు కోసము ఇన్ని మార్గములు పడుతున్నారు గాని నిజముగా యోచిస్తే అన్నీ చేరి ఒక్కటే. ఏ మతమును మనము విమర్శించకూడదు. నా మతము వేరని దానిని వర్ణించకూడదు. అన్ని మతముల యొక్క అభిమానమును మనము పురస్కరించుకోవాలి. కేవలము నా మతము గొప్పది నీ మతము గొప్పది అని వాదోపవాదములు వేయుటమే కేవలము సంకుచితమైన బుద్ధుల ప్రభావము. అన్ని మతములు ఒక్కటే. మతముల యొక్క బోధలు ఒక్కటే. అన్ని మతముల యొక్క సత్యము ఒక్కటే. సంకుచితమైన భావముల లోపం పరమతములను విమర్శించటమూ గాని స్వమతమును వర్ణించటము గాని ఉండకూడదు కనుక అన్నింటికిని గౌరవమును అందించాలి. ఈ విధమైన సమాత్వమును మనము అనుసరిస్తే, మన దివ్యత్వమనేది మనకు ఆవిర్భవిస్తుంది. కాన విద్యార్థులు క్రమక్రమంగా విధుల్లో పాటు, సమర్థముల్లో పాటు ప్రేమతత్వాన్ని అనుభవించి దివ్యత్వమైన ఏకత్వమును మనము అనుభవించాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.